



# బిస

పోట్లూరు సుబ్రహ్మణ్యం

**మహా వృక్షాలూ.** పెద్ద చెట్లూ, ఒ మాదిరి చెట్లూ పిచ్చి మొక్కలతో కలగాపులగంగా పెరిగిన అడవిలా కొమ్ములు తిరిగిన కంట్రాక్టర్లు, వ్యాపారస్థులూ, చక్కెర డీలర్లూ, వృద్ధాప్యపు పింఛను అర్జీదార్లతో తాలూకా ఆఫీసు ఆవరణ కోలాహలంగా ఉంది. చేతిలో కాగితాలతో ముఖంలో ఆందోళన నిండిన అర్జీదార్లు వర్షంకోసం ఎదురు చూసే రైతుల్లా ఉన్నారు. బడా బడా కంట్రాక్టర్లు కాళ్ళు ఊపుకుని సిగరెట్లు కాల్చుతూ ఉంటే, వ్యాపారస్థులు తమలాంటి వ్యాపారస్థులతో లాభనష్టాల గురించి చర్చించుకొంటున్నారు. ఇక చక్కెర డీలర్లు తమకు రాబోయే కోటా గురించి, దాని హెచ్చుతగ్గుల గురించి ఆరా తీస్తున్నారు. పొగాకు నములుతూ కొంతమంది ముసలివాళ్ళు, బీడీలు తాగుతూ మరి కొంతమంది వృద్ధులు అయ్యగారికి తమ బాధలు ఎలా వర్ణించి చెప్పుకోవాలో రిహార్సల్సు వేసుకొంటున్నారు. అంత సమయం వాళ్ళకు ఉండడానికి కారణం సదరు తాలూకాకు ఏలే రాజుగారు ఇంకా ఆఫీసుకు రాకపోవడమే.

ప్రజలకు నిత్యావసర వస్తువులైన చక్కెర, బియ్యం, గోధుమలు, కిరోసిన్ సప్లై చేయడం దగ్గర్నుంచి, పిల్లల్ని స్కూళ్ళలో చేర్పడానికి ఆదాయం సర్టిఫికేట్, కులం సర్టిఫికేట్లు అయ్యగారే ఇవ్వాలి. బీదవాడికి పొలం, నీడలేని వాడికి గూడు కల్పించేది తాసిల్దారే. కొంపలు కొట్టుకుపోయినా, కొంపలు కాలిపోయినా గవర్నమెంటు హెడ్ క్రింద డబ్బు డ్రా చేసి వాళ్ళ నాదుకోవడం, దిక్కులేని ముసలి వాళ్ళకు వృద్ధాప్యపు పెన్షన్లు మంజూరు చేసి వాళ్ళ జీవితాలకు భద్రత కల్పించడం ఆయనే

చేస్తాడు. కాంట్రాక్టర్లకు అస్తిపాస్తుల్ని బట్టి వాళ్ళ ఆర్థిక హోదాని తెలియచేసే సాల్వెన్సీ సర్టిఫికేట్లు ఇష్యూ చేసే వాళ్ళకు కొండంత్లపాడుకొనే విలువ కల్పించడం, ఒకటేమిటి ప్రజా జీవితంలో అన్ని కోణాలతో పూర్తిగా ముడిపడిన ఒకే ఒక డిపార్టుమెంటు రెవెన్యూ డిపార్టుమెంటు. అందుకే ఆ డిపార్టుమెంటు అంటే ఒక విధమైన గౌరవం, దాంట్లో పని చేసే ఉద్యోగులంటే ఒక విధమైన భక్తి ప్రజల్లో ఉంది. ఇదంతా ఒక ఎత్తయితే, జిల్లానేలే కలెక్టరుగారు అదే డిపార్టుకు చెందడం ఆ గౌరవం పెరగడానికి నానానికి రెండో వైపులా దోహదం చేస్తుంది.

''ఎక్కడోయ్ మన ఆస్థాన తబలిస్టు? పదవుతున్నా ఇంకా రాలేదు.'' అడిగాడు అసైన్‌మెంటు డిప్యూటీ తహశీల్దారు మూర్తి.

''వస్తుండాలి, సార్! ఇంకా అరగంట ఉంది గదా ఆఫీసు టైముకు.'' జవాబిచ్చాడు సివిల్ సప్లైస్ క్లర్కు మురళి.

''ఆ!. . .మనం రూల్సు ప్రకారం చేస్తే పనులు అవుతాయా! రోజూ తొమ్మిదింటికే వచ్చేస్తున్నాంగా.'' ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దారు హరినాథ్ అందుకొన్నాడు.

''అసలు సంగతి మీ కెవ్వరికీ తెలియదోయ్! వాడు వంతు ప్రకారం ఈ రోజు రెండవ ప్రియురాలితో కులుకుతూంటాడు. ఆయన ఎట్లయినా ముగ్గురు భార్యల ముద్దుల మొగుడు కదా! ఆ అదృష్టం అందరికీ వస్తుందా.'' మూర్తి పకపకా నవ్వాడు. అతని మాటలకు హాల్లోని స్టాఫంతా ఘొల్లున నవ్వారు.

నవ్వుతూ తలెత్తి చూసిన మూర్తి స్టన్ అయ్యాడు.

ఎదురుగా గిరజాల పైకి శరీరానికి అతుక్కుపోయిన పంటు, భుజాల మీది చినిగిపోతే రఫ్ చేసిన కాటన్ చొక్కా, నెత్తిమీద చెరిగిన జుట్టు, పీక్కుపోయిన ముఖాన ఎదిగిన గడ్డం, దీక్షతో చూసే కళ్ళు వేరే విషయాన్నాలోచించే తీరిక లేనట్లున్నాయి. టైపిస్టు రంగారావు.

కొద్దిసేపు స్టన్ అయిన మూర్తి ఏమాత్రమూ కంగారు పడకుండా 'ఏమిటోయ్ రంగారావ్! అలా నిలబడిపోయావ్?'' అన్నాడు నవ్వుతూనే.

''మిస్టర్ మూర్తి! యూ కాంట్ విత్ డ్రా యువర్ వర్డ్! ఎందుకు నన్నిలా అవమానిస్తావు.' శాంతంగా అన్నాడు రంగారావు. అవమానం జరిగాక గౌరవించవలసిన అవసరం లేదు.

అతని శాంతం చూసేసరికి మూర్తికి ధైర్యం చిక్కింది.

''అవునోయ్! నే నన్నదాంట్లో తప్పేముంది, ముగ్గురు ప్రియురాళ్ళ మధ్య మురిసే అదృష్టవంతుడు మా రంగారావు అన్నాను.''

''అదే! అదే వద్దంటున్నాను. నోటికొచ్చినట్లల్లా అని, నన్నే కాక నన్ను నమ్ముకొన్న స్త్రీలను కూడా అవమానిస్తున్నావు.''

''అయితే వాళ్ళు నీ భార్యలు కారా?''

''నీకు తెలుసుగా! నా పెళ్ళి రిజిస్ట్రారు ఆఫీసులో ఎవరితో అయిందో.''

''అవును. నేనూ వచ్చాను. ఆనాటి నుంచీ చిన్ననాటి స్నేహితుడనయిన నీ ఇంటికి రావడం మానేశాను. ఎందుకు?''

''తెలుసు మీరు ఇచ్చే విలువ సంఘం కట్టుబాట్లకే గాని, సంఘంలోని మనుషుల జీవితాలకు కాదు.''

''అది సరేనయ్యా! ఇప్పుడు రంగనాయకులపేట, బాలాజీనగర్‌లలో ఉన్న రెండు కాపురాల సంగతేమిటి? వాళ్ళని నువ్వు పోషించడం లేదా?''

''పోషిస్తున్నాను. కాని ఎందుకు పోషిస్తున్నానో నీకు చెప్పి, నీ ద్వారా వాళ్ళ పరువు పోగొట్టదలచుకోలేదు.''

''నువ్వు గుప్పిట్లో మూసినంత మాత్రాన ఎవరికీ తెలియదనుకోకు నీ చరిత్ర.''

''ఏమిటి నీకు తెలిసేది? నా వ్యక్తిగత విషయంలో జోక్యం చేసుకోవడానికి నువ్వెవరు?

''దట్ యు నో! ఆఫ్టరాల్ టైపిస్టువి. నీకేమిటి భయపడేది?

ఇద్దరికీ మాటా మాటా పెరిగింది. చాలా సీరియస్‌గా తిట్టుకొన్నారు. ప్రక్కనున్నవాళ్ళు సర్దడానికి ప్రయత్నించారు కాని, ఏమాత్రమూ ఆ జోరు తగ్గలేదు. ఏం చేయలేక ఆఫీసు స్టాఫంతా చుట్టూ ప్రేక్షకుల్లా నిలబడిపోయారు. ఎప్పుడూ ఎవరితోనూ మాట్లాడక తన పని తాను చేసుకొని పోయే రంగారావు, అందరిచేతా మంచివాడనిపించుకొనే డిప్యూటీ తహశీల్దారు మూర్తి ఇలా ఘర్షణ పడడం అందరికీ కొత్తగానూ, ఆశ్చర్యంగానూ ఉంది.

ఇంతలో తహశీల్దారుగారి జీపు వదలిన బాణంలా సర్రున దూసుకు వచ్చి, సడన్ బ్రేకుతో ఆగింది. కొంగల గుంపులో రాయి విసిరిన చందాన ఆఫీసు జీపును చూసి ఎగిరి తప్పుకొన్నారు జనం. తరువాత ప్రశాంతంగా తను చేతిలోని కాగితాలవైపు చూసుకొన్నారు.

తహశీల్దారు వచ్చాడనేసరికి స్టాఫంతా సీట్లలో సర్దుకొని కూర్చున్నారు. కాని రంగారావు, మూర్తి అదే స్థాయిలో తిట్టుకోసాగారు. తహశీల్దారు రూము వేరుగా ఉన్నందున ఈ మాటలు ఆయనకు వినబడడం లేదు.

చివరకు రంగారావు ఏమనుకున్నాడో, ఏమో వెంటనే ఒక తెల్ల కాగితం తీసుకొని బరబరా రెండు లైన్లు గీకి నేరుగా వెళ్ళి తహశీల్దారు ముందు నిలబడ్డాడు.


''ఏం రంగారావ్? ఏం కావాలి?'' అడిగాడు తహశీల్దారు. రంగారావు మౌనంగా తన చేతిలోని కాగితాన్ని అందించాడు.

''ఇదేమిటి? ఎటూ గాకుండా సడన్‌గా పదిహేను రోజులు లీవు పెడితే ఆఫీసు ఏం కావాలి? రేపు కలెక్టరు కాన్ఫరెన్సుంది. పర్టికులర్స్ టైపు చేయాలి. వెంటనే రెండు రోజుల తర్వాత చీఫ్ మినిస్టరు వస్తున్నాడు. పట్టాలు టైపు చేసి ఆయన ద్వారా డిస్ట్రిబ్యూషన్ చేయించాలి. తరువాత నాలుగు రోజుల్లో కలెక్టరాఫీసులో డిస్ట్రిక్టు రెవెన్యూ ఆఫీసర్ల కాన్ఫరెన్సు ఉంది. నీవు లేకపోతే ఇవన్నీ ఎలా జరుగుతాయి?'' తహశీల్దారు ఆందోళనగా అన్నాడు.

రంగారావు ఏం మాట్లాడకుండా తహశీల్దారు వైపు ఒకసారి చూసి—''నేను వెళుతున్నాను సార్!'' అంటూ తహశీల్దారు జవాబుకోసం కూడా ఎదురు చూడకుండా వెళ్ళిపోయాడు.

తహశీల్దారు ఈ లోకంలోకి వచ్చి ఈ ఆకస్మిక పరిస్థితికి కారణం ఆలోచించసాగాడు. ఈ లోపల అయ్యగారి పర్సనలు జవాను నజీరు సాహెబు వచ్చి 'అయ్యా జరిగిందిది' అంటూ విషయమంతా నివేదించాడు.

తహశీల్దారు తలపట్టుకొని — ''డిప్యూటీ తహశీల్దారు మూర్తిని రమ్మను'' అన్నాడు.



రెండు నిమిషాల్లో తిరిగివచ్చాడు జవాను.

"సార్! వారు క్యాంప్‌కెళ్ళారుట, సార్."

"క్యాంపు కెలా వెళతాడు చెప్పకుండా—నేను ఆఫీసులో ఉన్నప్పుడు కూడా."

"ఏమో సార్! ఇది జరిగినాక తమరు పిలుస్తారేమో నని వెళ్ళుంటాడు."

"పోయినుతే ఆ టైపిస్టునన్నా పిలువ్."

"ఆయనెక్కడున్నాడు, సార్! ఇందాక తమరికి లీవు లెటరు ఇచ్చిన వెంటనే వెళ్ళిపోయాడు."

తహశిల్దారుకు అంతా అయోమయంగా ఉంది. ఇష్టమైతే ఉంటే రాజీ చేయాలనుకున్నాడు. కాని ఇప్పుడా అవకాశం లేదు. ఏం చేయాలో తోచలేదు.

"అర్జీదార్లను లోపలికి పంపించు" అంటూ హుకూం జారీ చేశాడు—రేపట్నుంచి టైపిస్టు లేని ఆఫీసు ఎలా ఉంటుందా అని ఆలోచిస్తూ.

టైపిస్టు ప్రతి ఆఫీసులోనూ ఉండే ముఖ్యమయిన పోస్టు. వాహనానికి చక్రం ఎంత ముఖ్యమో ప్రతి ఆఫీసుకూ టైపిస్టు అంత అవసరం.

• • • •

పెన్షన్ వది గట్టున కూర్చున్న రంగారావు మనసు మనసులో లేదు. చేతిలోని మట్టిబెడ్డల్ని ఒక్కొక్కదాన్ని ఏట్లోకి విసురుతూ ఆలోచిస్తున్నాడు. పదిమందిలో తను ఎంత చులకనై పోయాడు. ఎవరూ చేయలేని పని చేయడమా దీనికి కారణం లేక అది తనను నమ్ముకొన్న వాళ్ళ దురదృష్టమా ఇలా నలుగురిలో నగుబాట్లు కావడానికి. దారి తప్పిన వాళ్ళ జీవితాలను ఆదుకోవడం ఈ సంఘంలో తప్పే అయితే, తను మహా పాపి కావాలి. కాలిపోతున్న జీవితాల్ని అలా కాలిపోనిస్తేనే వీళ్ళ కానందం. ఇలా ఆనందించే ప్రజలకు ఈ కృత్యం ఎలా పని కొస్తుంది. విమల, కమలమ్మ, రంగనాయకి తన జీవితంలో తటస్థపడ్డవాళ్ళు.

## విమల


ఒకరోజు అలవాటయిన దారి వెంట అర్ధరాత్రి పూట భూసంస్కరణాల పర్టికులర్స్ టైపు చేసి వస్తున్నాడు. సందు మలుపు తిరుగుతున్న తనకి తన ప్రక్కనే ఇంటి గోడనానుకుని ఉన్న బావి గట్టు మీద నిలబడి ఒక స్త్రీ పైట నడుముకు బిగించుకొంటూంది. క్షణంలో అర్ధమయిపోయింది ఆమె ఆత్మహత్య చేసుకోబోతూందని. తను ఒక్క ఉదుటున గోడ దూకి వెళ్ళి ఆమెను అక్కడినుంచి లాగాడు అప్రయత్నంగా.

ఆమె ఏడ్చింది—తన చావుకు అడ్డురావద్దని. కారణం అడిగాడు. చెప్పలేదు. చాలాసేపు ప్రతిమాలింతర్వాత చెప్పింది. ఎంతో కష్టపడి విజయవాడలో ఒకతని కిచ్చి పెళ్ళి చేశారని, తనకు పిల్లలు పుట్టరని డాక్టరు చెప్పేసరికి భర్త విడాకు లిచ్చాడని, అప్పటినుంచి తను తల్లిదండ్రులకు భారంగా బ్రతుకుతున్నానని, ఈ మానసిక క్షోభ భరించలేకనే తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు చెప్పింది. తనకు అప్పటికింకా పెళ్ళి కాలేదు. వెంటనే ఒక నిశ్చయానికొచ్చి, ఇంట్లోవాళ్ళని నిద్ర లే

విషయం చెప్పి ఒప్పించాడు. మరు నాడే రిజిస్ట్రారు ఆఫీసులో తనకు విమలతో వివాహం జరిగిపోయింది. వివాహానికి మిత్రుడు మూర్తి సాక్షిగా వచ్చాడు. తరువాత ఎవరి మాటలో విని, కులం కాని కులం వాళ్ళను చేసుకొన్నాడనే నెపంతో మూర్తితోపాటు కొంతమంది మిత్రులు రావడం మానుకొన్నారు.

## కమలమ్మ

నలుగురు పిల్లల తల్లి. ఏదో ఆఫీసులో ప్యూనుగా పని చేస్తున్న భర్త అర్ధాంతరంగా చనిపోయాడు. లీగల్ హెయిర్ సర్టిఫికేట్‌కోసం పిల్లలతో తాలూకా ఆఫీసుకు వచ్చింది. తనకెందుకో ఆమె మీద చాలా సదభిప్రాయం ఏర్పడింది. పిల్లలందరూ రెండేళ్ళ నుంచి పదేళ్ళలోపువాళ్ళే. అందరూ తనవైపు జాలిగా చూస్తున్నారు. టైపు చేస్తూ ఆమెను దగ్గరకు పిలిచి విషయం అడిగాడు. తన భర్త




చనిపోయాడని, లీగల్ హెయిర్ సర్టిఫికేటు ఇస్తే కొంత డబ్బు వస్తుందని చెప్పింది. కాని తనకు పోటీగా ప్రక్క తాలూకాలో ఇంకో స్త్రీ ఆయన్ని తన భర్త అని చెప్పుకొని ఆ డబ్బుకోసం ప్రయత్నిస్తూందని, తన అదృష్ట మెలా ఉంటుందోనని వాపోయింది. ఆమె అడ్రసు తెలుసుకున్నాడు తాను.

నెల తరువాతగాని తీరిక దొరకలేదు. భూమి శిస్తు వసూళ్ళ సీజను కాబట్టి ఇంటికి వచ్చేసరికి రాత్రి పదయ్యేది రోజూ. ఉదయం ఎనిమిది గంటలకే ఆఫీసుకు పోవలసివచ్చేది. ఆ రోజు ఉదయాన్నే పది గంటలు అవుతుండగా బాలాజీ నగర్‌లో ఉన్న ఆమె ఇంటికి బయలుదేరాడు—ఎలాగో తీరిక చేసుకొని. చుట్టూ పెరిగిన తుమ్మ చెట్ల మధ్య ఒక పూరిల్లుంది. వీధివైపు తుమ్మ చెట్ల మధ్యగా దారి ఉంది. ఇంటిపైన తాటాకు కప్పు సగం పైన లేచిపోయి ఉంది. గోడలు ఏ క్షణాన అయినా

కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. రెండు నిమిషాలు ఆదేపనిగా తట్టిన తరువాత తలుపులు తెరుచుకున్నాయి. ఒక పదేళ్ళ కుర్రాడు జారిపోయే నిక్కరు పైకి లాక్కుంటూ వచ్చాడు. ఎండిపోయిన ముఖం, పుసులు కట్టిన కళ్ళు. ఇంతకాలం తర్వాత తమకోసం ఎవరో వచ్చారని తెలిసి ఆశ్చర్యపోయాడు.

"ఎవరూ" అంది ఒక హీన స్వరం. ఆ వెనకనే చెక్కలతో నడిచి వచ్చినట్లు వాకిట్లోకి వచ్చి నిలబడిందామె. కాలుతున్న శవం మధ్యలో లేచి నిలబడ్డట్లుంది. నెల క్రితం చూసిన స్త్రీకి, ఈ స్త్రీకి చాలా తేడా కనబడుతూంది.

"ఎవరు కావాలి?" అంది ఆశ్చర్యంగా.

"గ్రాట్యుటీ ఇచ్చారా! పెన్షను వస్తూందా?" అడిగాడు తను.

అంతే బొమ్మకు ప్రాణం వచ్చినట్లు ఒక్కసారిగా ఘొల్లున ఏడవడం మొదలు పెట్టిందామె. ఆ ఏడుపు విని పదేళ్ళ పిల్లవాడు, మిగతా ముగ్గురూ

ఏడవడం మొదలు పెట్టారు. చుట్టుపక్కల వాళ్ళకు నెల నుంచి ఈ ఏడుపులు వినడం అలవాటయ్యింది కనక తలకూడా తిప్పి చూడలేదు. శోకాల మధ్య వెక్కుతూ చెప్పింది "పక్క తాలూకాలో తనే భార్యనని చెబుతున్న ముండ... అదే తన భర్త ఉంపుడుగత్తె లీగల్ హెయిర్ సర్టిఫికేట్ సంపాదించి తానే డబ్బంతా తీసుకుందని, పరపతి, డబ్బు ఉంది కాబట్టి ఆమె మాటే చెల్లిందని తనకు దిక్కూ మొక్కూ లే'దని చెప్పుకుని ఏడిచింది.

వాళ్ళ పరిస్థితికి జాలి పడిన తను ఆ కుటుంబం బాధ్యత తీసుకున్నాడు. పెద్ద పిల్లాడిని ఒక ప్రయోజకుడిగా చేయాలి. తరవాత—

## రంగనాయకి

బాధ్యతలు ఎక్కువవడంతో సంపాదన పెంచుకోవలసిన అవసరంకూడా కలిగింది. అందుకని తీసుకున్న

సమయాల్లో పక్కనున్న పోలీసు స్టేషనుకు వెళ్ళి టైపు చేసేవాడు. అక్కడ పని చేసేది లేడీ టైపిస్టు. సాయంత్రం అయిదు తరవాత ఉండదు. ఆ సమయాల్లో తను వెళ్ళి రిపోర్టులు టైపు చేసి డబ్బు సంపాదించేవాడు. ఆ రోజు పోలీసులు కొత్త రోడ్డుకు అటూ ఇటూ ఉన్న బ్రోతల్ కంపెనీల మీద రైడ్ చేసి గుడిసెలన్నీ తగుల బెట్టేశారు. దాదాపు ముప్పై మంది స్త్రీలను అరెస్టు చేసి పోలీసు స్టేషనుకు తీసుకు వచ్చారు. వాళ్ళల్లో రంగనాయకి ఒకతె.


అందరినీ కోర్టుకు హాజరు పరిచారు. జడ్జి మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాలని లేదా అయిదు వందల రూపాయలు జరిమానా అయినా కట్టాలని తీర్మానం చేశాడు. దాన్లో కొంతమంది రహస్యంగా కంపెనీలు నడుపుతున్న ప్రొప్రయిటర్లు తలా కొంతమంది స్త్రీలకు ఫైన్లు కట్టి తీసుకుపోయారు.

కాని రంగనాయకి తన మీద డబ్బు కట్టి విడిపించబోతే ఒప్పుకోలేదు. "నేను రాను. ఖర్మ సరిగా లేక నైతికంగా ఒకసారి చెడిపోయాను. ఇక ఆ వృత్తి లోకి పోదలుచుకోలేదు. జైలు శిక్ష అనుభవిస్తాను" అంది. అది టౌన్లో అతి ముఖ్యమైన పోలీసు రైడ్ కాబట్టి, ఒకటి రెండు సార్లు తీరిక చేసుకుని కోర్టుకు వెళ్ళిన తాను ఆమె నిజాయితీకి జోహార్లు అర్పించాడు. ఏదైనా సహాయం చేయాలని నిశ్చయించుకున్నాడు.

మరు రోజు అధికారులు కొత్త రోడ్డుకు ఆ వైపూ, ఈ వైపూ కాలిపోయి మొండి గోడలతో కనబడుతున్న ఇండ్లను బుల్‌డోజరులతో చదును చేశారు. ఇప్పుడు అక్కడ ఒక్క గుడిసెకూడా లేదు. అక్కడ పడుపు వృత్తి నడుపుతున్న వాళ్ళంతా చెల్లా చెదరై ఎక్కడెక్కడో జీవించడం మొదలు పెట్టారు. మూడు నెలల తరవాత రంగనాయకి విడుదలయ్యే రోజు తెలుసుకుని తను అక్కడ హాజరయ్యాడు. తన తోటి స్నేహితులయిన పోలీసుల సలహానికూడా త్రోసి పుచ్చి ఆమెకు కొత్త జీవితాన్ని ప్రసాదించాలనుకున్నాడు.

ఆమె తన కెవరూ లేరని చెప్పింది. తను ఆమెకు ధైర్యం చెప్పి రంగనాయకుల పేటలో ఒక ఇల్లు చూసి అక్కడ పెట్టాడు. ఆమెను అక్కడ చేర్చి ఇప్పటికి రెండేళ్ళయింది. తను కొంత కూడ బెట్టాడు— ఆమెను ఒక వైపు పోషిస్తూనే. త్వరలో ఆమె చేత ఒక చిన్న కిళ్ళీ బంకు పెట్టి స్వయం కృషిలో బతికేట్లు చేయాలి. ఇదీ తన ఆశయం. వాళ్ళ మధ్య తన ఆర్థిక సహాయం ఎలాగూ ఉంటుంది. అయినంత మాత్రాన తనకు వాళ్ళతో చెడ్డ సంబంధం ఎందుకు ఉంటుంది? ఒక మనిషికి ఇటువంటి ప్రోత్సాహం ఇవ్వక పోగా, నలుగురిలో అనుమానించడానికి ఎందుకు ముందుకు వస్తుంది ఈ సమాజం!

ఉదయం కమలమ్మ ఆఖరు కొడుక్కి నలతగా ఉంటే డాక్టరుకు చూపించి రావడంలో కాస్త ఆలస్యమయింది. కనకనే తన కింత ఆవమానం.



అనవసరమయిన మానసిక క్షోభ. ఆయామ్ నాట్ ఎ కాగ్ ఇన్ ది మెషిన్. ఆయామ్ ఏ హ్యూమన్ బీయింగ్ అనుకున్నాడు. ఒక వేళ తను పొద్దున లేస్తే మిషన్‌తో డీల్ చేయొచ్చు. అంత మాత్రం చేత తను మిషన్‌లో పార్టు కాదు కదా! తనకూ ఒక మనసంటూ ఉంది. కాలం పాజిటివ్‌గా ముందుకు పోతూంటే మనుషుల ఉద్దేశాలు నెగిటివ్‌లో నడుస్తున్నాయి.

రంగారావు ఆలోచనల్ని కట్టిపెట్టి పైకి లేచాడు. పెన్నానది ఒడ్డునే కట్టిన ఆ పార్కులో అందరూ లేచి పోయారు. సమయం పది కావ స్తూంది. మెల్లగా లేచి తనూ బయలు దేరాడు ఇంటికి. రంగనాయకుల పేట లోకి రాగానే ప్రతిమా టైపు ఇన్‌స్టిట్యూట్ వైపు దారి తీశాడు. ఇన్‌స్టిట్యూట్ మూసి వేయబోతున్నారు.

రంగారావును చూడగానే ప్రిన్సిపాల్—"ఏం సార్! ఈ రోజు రాలేదు" అంటూ పలకరించాడు.

"వేరే పనుండి రాలేక పోయాను, సార్ రేపటి నుంచి పగలుకూడా రాదలుచుకున్నాను."

"అంతకంటే మహాభాగ్యమా!" ప్రిన్సిపాల్ నవ్వుతూ అన్నాడు.

మిషను ఇచ్చి, జాబ్ వర్కు ఇస్తాడు ప్రిన్సిపాల్. వచ్చిందాంట్లో చెరి సగం. సాయంత్రానికి తన భాగం కింద ఒక పాతిక ఎలాగూ వస్తుంది. అదీ ప్రిన్సిపాల్ సంతోషం.

"కారణం తెలుసుకోవచ్చా, సార్" అడిగాడు ప్రిన్సిపాల్.

"ఆఫీసు పని ఒత్తిడి ఎక్కువగా ఉంది. ఆరోగ్యం కూడా సరిగా ఉండటం లేదు. కొంత కాలంపాటు ఆ పాపి వర్కునుండి తప్పుకుందామని సెలవు పెట్టాను." జవాబిచ్చాడు రంగారావు అసలు విషయాన్ని దాస్తూ.

ఇంకేం అడగ లేదు ప్రిన్సిపాల్. ఆ రాత్రంతా ఆలోచనలతో గడిపాడు రంగారావు. సెలవు పెట్టి నంత మాత్రాన అతని మానసిక క్షోభ చల్లారలేదు. తను ఉద్యోగం లేకపోయినా బతగ్గలడు. టైపు ఇన్‌స్టిట్యూట్‌లో రోజుకు ఒక ఇరవై రూపాయలూ, పోలీసు స్టేషనులో ఒక పది రూపాయలూ తప్పక వస్తాయి. తను బతకడానికి, తన వాళ్ళు బతకడానికి పెద్దగా ఇబ్బంది పడనవసరం లేదు. ఇంకా అవసర మయితే లీవు ఎక్స్‌టెండ్ చేయదలుచుకున్నాడు రంగారావు.

• • • •

తెల్లారినప్పటినుండి పర్టికులర్స్ పంపమని ఫోన్ల మీద ఫోన్లు వస్తున్నాయి. తహశీల్దారు ఉన్న విషయం కలెక్టరుకు చెప్పి కొత్త టైపిస్టును అర్జంటుగా వేయమని కోరాడు. పదిహేను రోజులకే ట్రాన్స్‌ఫరు చేయడానికి వీలు లేదు కాబట్టి కలెక్టరు ఆఫీసునుంచి ఒక టైపిస్టును డిప్యూట్ చేశారు. అతను ఉదయం పదిన్నరకు డ్యూటీలో చేరాడు. కాన్ఫరెన్సు నోట్సు అతని కిచ్చారు టైపు చేయమని. మధ్యాహ్నం ఇంటికి పోతూ టైపిస్టును పిలిపించాడు తహశీల్దారు.

"ఏమయ్యా, కాన్ఫరెన్సు పర్టికులర్స్ తయా రయ్యాయా?" అడిగాడు.

"అప్పుడే ఎక్కడవుతాయి, సార్! ఇప్పటికి రెండు స్టేట్‌మెంటులు మాత్రమే చేశాను. ఇంకా పది స్టేట్‌మెంట్లు చేయాలి."

"ఇంత టైము పడుతుందా! రంగారావు రెండు గంటల్లో చేసేస్తాడే ఈ స్టేట్‌మెంట్లన్నీ."

"ఇంపాజిబుల్ సార్! ఇంతకీ ఆ టైపు రైటరు ఎప్పటిదనుకొన్నారు. బి పి నాటిది. లైన్ స్పేస్ లీవరు పని చేయదు. రోలరు చేత్తో త్రిప్పు కోవాలి. మార్జిన్ సెట్టర్స్ రెండూ పని చేయవు. టాబ్యులేటరు బారు విరిగి ఉంది. ఇకపోతే కీ బోర్డులో సగం వాటికి కీటాప్స్ లేవు. టైపు చేస్తూంటే వ్రేళ్ళకు గుచ్చుకొంటున్నాయి. అసలు ఈ టైపు మిషను మీద ఎలా టైపు చేస్తున్నారో అర్థం కావడం లేదు, సార్. ఇది కండెమ్డ్ సరుకు."

"అయితే పర్టికులర్స్ నా కెప్పటి కందిస్తావు?"


"సాయంత్రానికి సగం కూడా కావు, సార్. రేపు సాయంత్రానికయితే పూర్తి కావచ్చు."

"అదెలా కుదురుద్దయ్యా—ఈరోజు సాయంత్రమే వాటిని కలెక్టరాఫీసులో సబ్మిట్ చేయా ల్నుంటే."

"ఆయామ్ సారీ, సార్! నా వల్ల కాదు."

"అవన్నీ నాకు తెలియదు. బై హుక్ ఆర్ క్రూక్ నీవు ఈరోజు సాయంత్రానికి గాని పర్టి కులర్సు అందించకపోతే పరిస్థితి వేరే విధంగా ఉంటుందని గుర్తుంచుకోండి." అన్నాడు సీరియస్‌గా, దౌర్జన్యానికి దిగితే తప్ప పని కాదని.

వైటు టెరీకాటన్ పాంటు మీద, ఎర్రపూల




టెలిఫోన్ ప్లాకు ఇన్సర్టు చేసి ఉన్నాడు కొత్త టైపిస్టు, ఎడమ చేతికి ఎలక్ట్రానిక్ వాచ్, వేళ్ళకు రెండు ఉంగరాలు, కుడిచేతికి రాగి కడియం, కళ్ళకు గాగుల్సు ఉన్నాయి. ఎడమచేత్తో హిప్పీ జుట్టును అప్పుడప్పుడు విలాసంగా తిప్పుకొంటున్న టైపిస్టు ఈ మాటలు వినగానే తనూ సీరియస్ అయ్యాడు.

''అలాగే, సార్'' అంటూ ఎర్రబడ్డ కళ్ళతో లోపలికి వెళ్ళాడు.

ఎలాగయినా జయించాం కదా అని తృప్తిగా ఉంది తహశిల్దారుకు. అందుకే ఇంటికి వెళ్ళి భోంచేసి రెస్టు తీసుకుని నాలుగుకు పది నిముషాలుండగా తాలూకాఫీసు చేరుకొన్నాడు. సీట్లో కూర్చోగానే బెల్ కొట్టాడు.

''టైపిస్టును పిలుస్తున్నానని చెప్పు'' అన్నాడు వచ్చిన ప్యూనుతో.

ప్యూను ముసి ముసి నవ్వులు నవ్వుకొంటూ అక్కడే నిలబడ్డాడు.

''ఏమయింది?'' అడిగాడు తహశిల్దారు.

''అతను వేసిన వర్కు చేయలేనని వెళ్ళిపోయాడు, సార్.''

''అలాగా! అయితే హెడ్ క్లర్కు ఏం చేస్తున్నట్లు.''

ప్యూను పిలుపును పురస్కరించుకుని హెడ్ క్లర్కు తహశిల్దార్ ముందు హాజరయ్యాడు.

జారిపోయే అద్దాల్ని పెట్టుకొంటూ అన్నాడు— ''కొత్తగా వచ్చిన టైపిస్టు వెళ్ళిపోయాడు, సార్! ఎంత చెప్పినా వినిపించుకోలేదు. ఆ మిషనుమీద ఎలా టైపు చేయాలండీ! మేమూ మనుషులమేగా! ఉన్నదున్నట్లు చెబితే ఆ తహశిల్దారు గారికి కోపం. చెప్పకపోతే ఆ ముసలి మిషను మీద టైపు చేయలేక మేము చావాలి. నా కిక్కడ గొడ్డు చాకిరీ చెయ్యాల్సిన అవసరం లేదు. ఇన్ఫ్లుయన్సు ఉంది. రేపే డెప్యుటేషను కాన్సిలు చేయించుకోవడానికి ప్రయత్నిస్తాను— అంటూ ఒకవారం రోజులు సెలవు పెట్టి వెళ్ళిపోయాడు.''

''మీరెందుకు తీసుకొన్నారండి ఆ లీవు లెటరు.''

''నేను తీసుకోలేదు, సార్! నా ముఖాన పారేసి, ఆ లెక్చరు దంచేసి వెళ్ళిపోయాడు.'' వినయంగా చెప్పాడు హెడ్ క్లర్కు.

తహశిల్దారుకు ఏమీ అర్థం కాలేదు. అంతా అగమ్య గోచరంగా ఉంది.

''ఇప్పుడేం చేయడం?'' సలహా అడిగాడు.

''ఇంక ఒక మార్గముంది, సార్. టైపు ఇన్స్టిట్యూట్‌లో జాబ్ వర్కు కియ్యడం.''

''ఎంతవుతుందంటావు!''

''పదహారు స్టేట్‌మెంటులున్నాయి. ఒక్కొకటి నాలుగు కాపీలు చేయాలి. ఒక ఏభై రూపాయలకు తక్కువ కాదు, సార్!''

''ఇదిగో తీసుకోండి. వెంటనే ఆ ఏర్పాట్లు చేయండి.'' విసుగ్గా అన్నాడు తహశిల్దారు ఏభై లెక్కపెట్టి ఇస్తూ.

''తమ దిష్టం, సార్'' అంటూ అయిష్టంగానే తహశిల్దారు నుంచి ఆ నోట్లు అందుకొని వెళ్ళిపోయాడు.

తహశిల్దారుకు ఎలాగో తన పరువు నిలబడినందుకు, పర్టికులర్సు పూర్తవుతున్నందుకు సంతోషంగా ఉంది. కాని ఇప్పుడిప్పుడే అటువంటి మనసులో తాలూకాఫీసుకు ఇరవై ఏళ్ళుగా అంటి పెట్టుకొని ఏ ఇబ్బందినీ రానివ్వని రంగారావు మెదులుతున్నాడు. అసలు జరిగిందాన్ని విచారించాలనీ, రంగారావు మరల పనిలో చేరేట్లు చేయాలనీ నిర్ణయానికి వచ్చాడు.

రంగారావు ఎంత పని చేసేవాడు. ఎన్ని కాగితాలు వచ్చినా సాయంత్రానికి ఫినిష్. పదహారు మంది గుమాస్తాలు, ఆయిదుగురు డిప్యూటీ తహశిల్దార్లు, ఒక డజను మంది రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, ఒక హెడ్ క్లర్కు, ఒక తహశిల్దారు ఆఫీసు స్టాఫు. అందరికీ ఒకే ఒక టైపిస్టు.

వరుసగా ఏళ్ళ నాడు సప్లయి చేసిన మిషనునే ఇప్పటికి వాడుతున్నారు. అది చూడ్డానికి ఒక స్కెలిటన్‌లా ఉంటుంది. కాని దాని మీదనే రంగారావు రాజధాని ఎక్స్‌ప్రెస్ స్పీడుతో టైపుచేస్తూ మృదుమధురమైన ధ్వనుల్ని వినిపిస్తాడు. లయబద్ధంగా సాగే ఆ శబ్దం ఇంకొంచెంసేపు వినాలనిపిస్తుంది ఎవరికైనా. అతను సర్వీసులో చేరిన ఇరవై ఏళ్ళ నుంచి అదే ఆఫీసులో పని చేస్తూ దాన్నే వాడుతున్నాడు. అప్పట్నుంచీ దాన్ని ఒక్కసారి కూడా రిపేరుకు గాని, సర్వీసింగుకు గాని పంపలేదు. అంటే ప్రతి సంవత్సరమూ రెండు వందల రూపాయలు ఖర్చు తగ్గిందన్నమాట. సర్వీసింగ్ గాని, మిగతా రిపేర్లు గాని, తానే స్వయంగా చూసుకొంటాడు. స్క్రూడ్రైవర్లు, బ్రష్‌లూ మిగతా పరికరాలు అతని వద్ద ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి. తను తహశిల్దారుగా వచ్చిన మూడు సంవత్సరాలలోనూ ఏనాడు రిపేరుకు వచ్చిందని గాని, టైపు చేయలేనని అని గాని అనలేదు. అన్నీ సవ్యంగా జరిగితేనే ఆఫీసు. రంగారావు విలువ ఇప్పుడు అర్థమవుతూ ఉంది.

తహశిల్దారు ఆలోచనల్ని భగ్నం చేస్తూ హెడ్ క్లర్కు వచ్చాడు. ''పర్టికులర్సన్నీ టైపు అయి వచ్చేశాయి, సార్! కాని'' అంటూ కాగితాలు టేబులు మీద పెడుతూ నసిగాడు.

''ఏమిటి?''

''అన్నీ ఫిగర్సులోనూ తప్పులు, ఓవర్ టైపింగులు ఉన్నాయి, సార్! కరెక్టు చేశాం అన్నిటినీ.''

''ఏదీ నన్ను చూడనీ'' అంటూ తహశిల్దారు మడిచి ఉన్న స్టేట్‌మెంట్లన్నీ టేబుల్ మీద మీద పరిచాడు. ఇంకు మరకలు, కొట్టివేతలతో నానా గలీజుగా ఉన్నాయి. ఫిగర్సు అన్నీ కలక్షన్సే.

''ఇటువంటి స్టేట్‌మెంటుస్ కలెక్టరుకెలా ఇస్తారయ్యా'' అన్నాడు బాధగా.

''తప్పదు, సార్! ఇక టైమేమీ లేదు.''

''ఇన్ని తప్పులు ఎలా చేశారయ్యా ఆ ఇన్స్టిట్యూట్ వాళ్ళు, అంత అనుభవం పెట్టుకొని. పిల్లలకు కూడా ఇలా నేర్పుతున్నారేమో''

''వాళ్ళదంతా వ్యాపార దృష్టి, సార్! ఇది చూసి నేను డబ్బులు కూడా పంపి ఉండేవాణ్ని కాదు. కాని ఇక సమయం లేదు. దానికే వాళ్ళు నసిగారట డబ్బులు తక్కువకు ఒప్పుకొన్నామని.''

తహశిల్దారు మాట్లాడకుండా బెల్ కొట్టి జవాన్ని పిలిచి, కాపురేన్సు ఫైల్సన్నీ దస్త్రంలో కట్టమన్నాడు. జవాను బ్లూ కలర్‌లో మందంగా ఉన్న నలు చదరపు గుడ్డ పరచి పాడ్స్ అన్నీ అందులో ఉంచి, నాలుగు మూలలూ బిగించి కట్టాడు. ఈ లోపల డఫేదారు దివాను తగిలించుకుని వచ్చాడు. తహశిల్దారు జీపులో కూర్చున్న తరువాత డఫేదారు వెనుక ఎక్కడం, జీపు స్టార్టవ ముందుకు దూసుకుపోవడం ఒకేసారి జరిగాయి.

ఆ సాయంత్రం కాన్ఫరెన్సులో తన తాలూకాకు సంబంధించిన ఫిగర్సు ఏవీ కలెక్టరుగారికి అర్థం కాలేదు. తహశిల్దారు పైకి లేచి తన దగ్గరున్న ఆఫీసు కాపీని బట్టి ప్రతిదీ ఎక్స్‌ప్లెయిన్ చేయవలసి

వచ్చింది. లేకపోతే ఆయనకు కోపమొచ్చి ఏమైనా రిమార్కు రాయవచ్చు. కాస్తనిస్తా పూర్తయి ఆఫీసుకు వచ్చేసరికి రాత్రి తొమ్మిదయింది. ఆఫీసులో హెడ్ క్లర్కు కాచుకుని కూర్చొని ఉన్నాడు. ఒకరిద్దరు డిప్యూటీ తహశీల్దార్లు ఏదో రాసుకొంటూ ఉన్నారు.

"సార్! ఈ రోజు వచ్చిన అర్జెంటు కాగితాలు టెలిగ్రాములు." రెండు పెట్టెలో విడివిడిగా కట్టిన తహశీల్దారు టేబులు మీద ఉంచాడు హెడ్ క్లర్కు.

వాటిని పరిశీలించిన తహశీల్దారు "టెలిగ్రాములు వచ్చేదాకా ఎందుకు ఉంచారు. రిపోర్టులు ఎందుకు పోలేదు అప్పుడే" అన్నాడు.


"ఏం చేయమంటారు సార్! మూడు రోజుల నుంచి టైపిస్టు లేడు. ఆఫీసులో గుమాస్తాలు వ్రాసిన కాగితాలన్నీ అంతవరకు పేరుకుపోయి ఉన్నాయి. అవన్నీ అర్జెంటు కాగితాలు. టైపవుతూ పోయి ఉంటే వాళ్ళకు ఇన్ టైములో జవాబులు చేరేవి. ఇన్ని టెలిగ్రాములు అర్జెంటు కాగితాలు వచ్చుండేవి కావు పైనుంచి. రోజూ సర్టిఫికేట్ల కోసం, లైసెన్సుల కోసం తిరిగిపోయే పార్టీలకు నేను జవాబు చెప్పలేకపోతున్నాను, సార్" తను అన్ని రోజులు పడ్డ బాధను వివరించాడు హెడ్ క్లర్కు.

"సరేనయ్యా! ఇక తప్పదు. టైపిస్టు రంగారావు లేకుండా ఈ ఆఫీసు ఒక్క రోజు జరగదని తెలుసుకున్నాము. ఎల్లుండి చీఫ్ మినిస్టరు వస్తున్నాడు. పట్టాలు టైప్ చేసి డిస్ట్రిబ్యూషన్ చేయించాలి. కనుక అతన్ని రప్పించే మార్గం తెలియజేయండి." హెడ్ క్లర్కుతో మంతనాలాడాడు తహశీల్దారు.

"తనకు జరిగిన అవమానానికి చాలా బాధపడుతున్నాడు, సార్! వస్తాడని నాకు నమ్మకం లేదు."

"మన డిప్యూటీ తహశీల్దారు మూర్తి ఏదో అన్నాడనేగా అతను బాధ పడటం. అతనిచేత అపాలజీ చెప్పిస్తాం. సరిపోతుందిగా." అతి తేలిగ్గా అన్నాడు తహశీల్దారు.

"అపాలజీ చెప్పేస్తే సరిపోయేంత తేలికయిన విషయం కాదు, సార్, అది. కాలువలో కుళ్ళిపోతున్న మురికిని బయటకు నెట్టి వేసినందుకు వాడిని చప్రాసీ అంటుంది సంఘం. ఆ చప్రాసీ వాడే లేకపోతే సంఘం మొత్తం మురికి కొట్టుకుపోతుంది. అది తెలియదు, సార్, ఈ సంఘానికి. చేయని నేరానికి అతి చిన్న వయసులోనే రాలిపోయే మొగ్గను తన హృదయం మీద నిలిపి కాపాడాడు సార్, మన టైపిస్టు. అది తప్పు!... భర్త అర్థాంతరంగా చనిపోతే, చిన్న పిల్లల్ని పెట్టుకొని కుమిలిపోతూ, గవర్నమెంటు సహాయం ఎదురు చూస్తున్న ఆమెను కొంతమంది స్వార్థపరులు మోసగించి నడి వీధిలో వదిలిపెట్టారు. గాలికి ఆరిపోయే దీపాల్లా ఉన్న వాళ్ళ జీవితాలు ఏం కావాలి? అలాంటి జీవితాల్ని ఒక గాటిలో పెట్టాలన్న తాపత్రయంతో వాళ్ళకు తాను అండగా నిలబడి పిల్లలకు విద్యాబుద్ధుల్ని చెప్తూ వాళ్ళ



జీవితాలకు హామీ సమకూర్చిన రంగారావు తప్పుడు వాడా...

"... బ్రతుకుతెరువు లేక బ్రతుకుతెరువు కోసం, ఎవరో చేసిన మోసాలకు బలై తెలియని పడుపు వృత్తిలోకి దిగిన యువతి, తన అజ్ఞానం వదిలి నీతిగా బ్రతకాలనుకుంటే ఈ సంఘం ఒప్పుకోలేదు. దగ్గరకు రానివ్వలేదు. కాని సంఘాన్ని లెక్కచేయక, మనసుకే ప్రాధాన్యత ఇచ్చి ఆమె ఆశయాల్ని సఫలీకృతం చేయాలనుకొన్న టైపిస్టు సంఘానికి చీడ పురుగా!... రాజా రామ్మోహన్ రాయలు, కందుకూరి వీరేశలింగం పంతులులాంటి సంఘ సంస్కర్తల కోవకు చెందినవాడు మన రంగారావు—ఆశయాలు వల్లించక, కర్తవ్యంలో చూపించి ఇతరులకు ఆదర్శప్రాయుడైనవాడు. అటువంటివాడు ముగ్గురు భార్యలకు ముద్దుల మొగుడా!... అతని గుండె ఎంత ఛిన్నాభిన్నమయ్యుంటుందో నాకు తెలుసు, సార్. అందుకే అతన్ని నేను ఆపలేదు. తినడానికీ లేక పరులకోసం రాత్రింబవళ్ళు కష్టపడుతూ సంసారాల్ని ఈడ్చుకొస్తున్నందుకు సంఘం ఇచ్చే బిరుదు ఇదా!... అని వాపోయుంటాడు సార్! నేను ఆఫీసులో హెడ్ క్లర్కునయినా ఫైళ్ళతోబాటు, వాళ్ళ జీవితాల్ని కూడా పరిశీలిస్తుంటాను, సార్" తన సుదీర్ఘమయిన ఉపన్యాసాన్ని ఆపాడు.

తహశీల్దారు ఆశ్చర్యపోయాడు. "నిజంగా నాకు తెలియదు, హెడ్ క్లర్కుగారూ, అతనింత గొప్పవాడని. అతను నిజంగా ఉదాత్తమయిన వ్యక్తి... మన అందరికంటే అతను ఎన్నో రెట్లు గొప్పవాడు" అన్నాడు చివరకు.

వెంటనే డిప్యూటీ తహశీల్దారు మూర్తిని పిలిపించాడు. మూర్తి హెడ్ క్లర్కు ప్రక్కనే తహశీల్దారుకెదురుగా కూర్చున్నాడు.

"మూర్తిగారూ. రేపు ఉదయమే మీరు జీపు తీసుకువెళ్ళి టైపిస్టు రంగారావును ఆఫీసుకు తీసుకురావాలి."

మూర్తి కళ్ళు చెమ్మగిల్లాయి. "తప్పక తీసుకొస్తాను, సార్! క్షమించమని చెప్పి మరీ తీసుకువస్తాను. వాడు చిన్నవాటినుండీ నా స్నేహితుడు, సార్. ఏదో తమాషాగా అన్న విషయం వాడు సీరియస్‌గా తీసుకోవడం, నేనూ ఆ బలహీనమైన క్షణాల్లో ఆవేశపడడం జరిగింది. దీనికంతకూ కారణం నేనే. రేపే వెళ్ళి తీసుకొస్తాను." మనస్ఫూర్తిగా బాధపడుతూ అన్నాడు మూర్తి.

నేను వెళ్ళను. నాకు తెలియదు అని మొరాయిస్తాడేమోననుకొన్న తహశీల్దారు—మూర్తి జవాబుకు తేలిగ్గా గాలి పీల్చుకొన్నాడు. హెడ్ క్లర్కు సంతోష సూచకంగా చిన్నగా నవ్వాడు.

• • • •

మరు రోజు ఉదయం పది గంటల సమయంలో హాల్లో ఊపిరి పీల్చుకొంది. తన మామూలు పక్కలో మృదుమధురమయిన సంగీతాన్ని వినిపిస్తున్నాడు టైపు మిషను మీద రంగారావు. ఎన్నో కాగితాలు టైపు రోలరు మీద గిర్రున తిరిగి వెళ్ళిపోతున్నాయి అమితవేగంతో. ఒకవైపు మనిషి ఎత్తున పెరిగిపోయిన ఫైళ్ళను ఏమాత్రమూ లెక్క చేయడం లేదతను. అలా ఫైలు అందుకోవడం, ఇలా మిషనులోకి వెళ్ళిన కాగితం అలా టైపయి ఫైల్లోకి వెళ్ళి ప్రక్కన పడిపోవడం క్షణాల మీద జరుగుతూ ఉంది. నిమిషాల మీద కాగితాలు కరిగిపోతున్నాయి. అతను ఏమాత్రమూ అయాసపడడం లేదు. ద్విగుణీకృత ఉత్సాహంతో ముందుకు... మరీ ముందుకు సాగిపోతున్నాడు. టైపిస్టు డ్యూటీలో చేరినట్టు అప్పుడే కలెక్టరుకు టెలిగ్రామిచ్చాడు హెడ్ క్లర్కు. తమ కాగితాలు ఎప్పుడు చేతికి వస్తాయా అని ఎదురు చూస్తున్న పార్టీలు టైపిస్టును ఆరాధ్య దైవంగా చూస్తున్నారు. ఏది ఏమయినా ఈ లోకంలో ఎవరి విలువ వారికి ఉంటుందనేది మాత్రం యథార్థం. *